


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

మంగళవారం 11 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :70 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## 22-ఏ నిషేధ జాబితా నుంచి విముక్తి పొందిన భూములకు పట్టాలు అందజేసిన సీఎం చంద్రబాబు

కలిదిండి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కలిదిండి తహశీల్దార్ కార్యాలయంలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 22-ఏ నిషేధ జాబితా నుంచి విముక్తి పొందిన అసైన్డ్, మాజీ సైనికుల భూములకు పూర్తి హక్కులు కల్పిస్తూ సంబంధిత రైతులకు పట్టాలను అందజేశారు. భూములపై పూర్తి హక్కులు పొందిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## డీఎస్సీ భర్తీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగింది: సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా చేయాలనే ఉద్దేశంతో వైసీపీ ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చామని, అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీపై తొలి సంతకం చేశామని చంద్రబాబు తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు కొందరు కోర్టులను ఆశ్రయించారని, న్యాయస్థానంలో ఉన్న సమస్యలను పరిష్కరించిన అనంతరం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని పేర్కొన్నారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత వైసీపీ రోడ్డెక్కి ఆందోళనలు చేయడం ఏమిటని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.



## ఎస్ఐఆర్ ఫారాల స్వీకరణ పూర్తి.. ఇంకా 69 లక్షల పత్రాల డిజిటలైజేషన్ పెండింగ్

హైదరాబాద్, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువు ముగిసింది. సోమవారం అర్ధరాత్రి వరకు ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగనుంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లోనూ డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా 3.38 కోట్ల మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేయగా, ఇప్పటివరకు 2.64 కోట్ల పత్రాల డిజిటలైజేషన్ పూర్తయింది. మరో 69 లక్షల మంది ఓటర్లకు సంబంధించిన పత్రాలు ఇంకా సమర్పించాల్సి ఉంది. హైదరాబాద్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతున్నట్లు తెలుస్తోంది. నగరంలో ఇప్పటివరకు 60 శాతం కూడా డిజిటలైజేషన్ పూర్తికాలేదు. గడువు ముగియడంతో మిగిలిన పత్రాల స్వీకరణ, డిజిటలైజేషన్‌తో పాటు తదుపరి ప్రక్రియపై ఎన్నికల యంత్రాంగం దృష్టి సారించింది.

## రాష్ట్ర సుభిక్షం కోసం నాగార్జునసాగర్‌లో మహా వరుణయాగం





నాగార్జునసాగర్, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా ముగిసింది. విజయ్ విహారం వద్ద కృష్ణా నది తీరంలో నిర్వహించిన ఈ యాగంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో యాగక్రతువులు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమగుండాల్లో వరుణదేవుడిని ప్రార్థిస్తూ హోమక్రతువులు నిర్వహించారు. మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా యాగంలో పాల్గొన్నారు. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు, చెరువులు, కుంటలు నిండాలని, భూగర్భ జలాలు పెరిగి పంటలు సమృద్ధిగా పండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలని, రాష్ట్రం సస్యశ్యామలంగా మారాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని వరుణదేవుడిని ప్రార్థించారు. వర్షాలు, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించే భారతీయ సంప్రదాయాలను గౌరవిస్తూ ఈ యాగాన్ని నిర్వహించినట్లు ప్రభుత్వం తెలిపింది. వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో వర్షపాతం పరిస్థితులపై దృష్టి సారించిన ప్రభుత్వం శాస్త్రీయ ప్రణాళికలతో పాటు సంప్రదాయ విశ్వాసాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, పి. సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కె. జానారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## రైతు సంక్షేమం, పేదల ఇళ్లే ప్రభుత్వ ప్రాధాన్యం: మంత్రి పొంగులేటి

హనుమకొండ, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రైతుల సంక్షేమంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని, పేదలు, రైతుల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా హనుమకొండలో నిర్వహించిన రైతు మేళాలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ రైతును రాజు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి నెలకు రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తోందని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధరతో పాటు సకాలంలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిందని తెలిపారు. మక్కలు, జొన్నలకు కూడా మద్దతు ధర కల్పించి కొనుగోళ్లు చేపట్టామని చెప్పారు. భూయజమానులకు వివాదాలు లేని హక్కులు కల్పించడమే భూభారతి లక్ష్యమని, తొలి దశలో చేపట్టిన రెవెన్యూ గ్రామాల సర్వేలకు భూయజమానులు సహకరించాలని కోరారు. వాతావరణ పరిస్థితులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. రాష్ట్రంలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న అర్హులందరికీ ఆసరా పెన్షన్లు మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. హనుమకొండలో నిర్వహించిన కృతజ్ఞతా సభలో పెన్షన్ సహాయ కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన అనంతరం ఇషా సూపర్ స్పెషాలిటీ, క్రిటికల్ కేర్ ఆసుపత్రిని ప్రారంభించారు. హైదరాబాద్‌లో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనను దృష్టిలో ఉంచుకుని దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 15 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, తొలి దశలో 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. ఆగస్టు 10 నాటికి 46,121 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. అర్హత పరిశీలన, ఇళ్ల కేటాయింపు, లాటరీ తదితర ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించి ఈ నెలాఖరులోగా కేటాయింపులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా వరంగల్ శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను ప్రారంభించారు. కాజీపేట దర్గా ఉర్సు వేడుకల్లో మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్, కొండా సురేఖతో కలిసి పాల్గొన్న మంత్రి, తెలంగాణ విభిన్న జాతులు, మతాలు, సంస్కృతుల సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కాజీపేట దర్గా అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం సహకరిస్తుందని, పూర్తి వివరాలు సమర్పిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అవసరమైన నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కే.ఎల్. నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ శ్రేణుల పోరాటంపై జగన్ హర్షం

అమరావతి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలకు భారీగా ప్రజలు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు హాజరైన నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ ప్రజలు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. గత రెండు నెలలుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన పోరాటాలు చిరస్మరణీయమని జగన్ అన్నారు. ప్రజల సమస్యలపై పార్టీ శ్రేణులు కొనసాగిస్తున్న ఉద్యమాలకు ఆయన అభినందనలు తెలిపారు.

# కొలంబియాలో భారీ భూకంపం.. పలు దేశాలకు ప్రకంపనలు

బొగోటా, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): దక్షిణ అమెరికా దేశమైన కొలంబియాలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రత నమోదైన ఈ భూకంపం కొలంబియా భూగర్భంలో సుమారు 107 కిలోమీటర్ల లోతులో సంభవించినట్లు సమాచారం. ప్రకంపనల ప్రభావం పొరుగున ఉన్న వెనెజువెలా, ఈక్వడార్, పనామా దేశాల్లోనూ కనిపించింది. భూకంపం ధాటికి కొలంబియాలో కొన్ని భవనాలు కూలిపోగా, పలువురు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. దక్షిణ అమెరికా ప్రాంతంలో వరుసగా భూకంపాలు సంభవిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. రెండు నెలల క్రితం వెనెజువెలాలోనూ తీవ్ర భూకంపం సంభవించినట్లు సమాచారం.

# డీఎస్సీ అంశంపై వైఎస్సార్‌సీపీ ఆందోళనలు.. రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు




అమరావతి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): డీఎస్సీ నియామక ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించారు. డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువత, నిరుద్యోగులు నినాదాలు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి అందించాలనే హామీని అమలు చేయాలని ఆందోళనకారులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించినట్లు వైఎస్సార్‌సీపీ వెల్లడించింది. పలుచోట్ల ర్యాలీలకు అనుమతులు లేవంటూ పోలీసులు ఆంక్షలు విధించారని, పార్టీ నాయకులు, కార్యకర్తలను అరెస్టులు, గృహ నిర్బంధాలు, ముందస్తు నోటీసులతో అడ్డుకున్నారని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. అయితే ఆంక్షలను అధిగమించి ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీలకు తరలివచ్చారని పార్టీ పేర్కొంది. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు.

# అమ్మాయిల దుస్తులపై కాదు.. అబ్బాయిల ప్రవర్తనపై దృష్టి పెట్టాలి: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అమ్మాయిలు ఎలాంటి దుస్తులు ధరించాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ వారికి ఉందని, వారి దుస్తులను ఆధారంగా చేసుకుని లైంగిక వేధింపులను సమర్థించడం లేదా బాధితురాలినే నిందించడం సరికాదని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. లైంగిక వేధింపుల కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. అమ్మాయిల వస్త్రధారణపై ఆంక్షలు విధించడం కంటే, అబ్బాయిలు తమ ప్రవర్తనను మార్చుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. మహిళలపై గౌరవప్రదమైన ప్రవర్తన, సమ్మతి, వ్యక్తిగత స్వేచ్ఛపై యువతలో అవగాహన పెంచాలని సూచించినట్లు తెలుస్తోంది.

# తల్లీబిడ్డల రవాణా సేవలపై వైసీపీ ఆరోపణలు.. పెరిగిన ధరలపై ప్రశ్నలు

అమరావతి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆస్పత్రుల నుంచి తల్లీబిడ్డలను ఇళ్లకు తరలించే రవాణా సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలపై వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. గతంలో 2022లో ఒక్కో ట్రిప్పునకు రూ.895గా ధర నిర్ణయించగా, ప్రస్తుతం అదే తరహా సేవకు రూ.1,640 చెల్లించేలా కొత్త ఒప్పందం కుదిరిందని వైసీపీ పేర్కొంది. దీంతో గత ధరతో పోలిస్తే సుమారు 83 శాతం అధికంగా చెల్లించాల్సి వస్తోందని, దీనివల్ల ప్రభుత్వంపై ఏటా రూ.15 కోట్లకు పైగా అదనపు భారం పడుతుందని ఆరోపించింది. ప్రతి ట్రిప్పునకు కమీషన్ అందే విధంగా ఒక సంస్థకు కాంట్రాక్ట్ కట్టబెట్టారని వైసీపీ నాయకులు ఆరోపించారు. కొత్త కాంట్రాక్ట్ సంస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా తల్లీబిడ్డల రవాణా సేవలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ధరల నిర్ణయం, ఒప్పంద వివరాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలపై ప్రభుత్వం లేదా సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

# షార్జా ప్రమాద బాధితుడికి కేటీఆర్ అండ.. స్వదేశానికి సతీష్ రాక




హైదరాబాద్, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): షార్జాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలంగాణకు చెందిన సతీష్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. ప్రమాదంలో గాయపడిన సతీష్‌ను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి కేటీఆర్ చర్యలు చేపట్టగా, ఆయన ఏర్పాట్లతో సతీష్ భారత్‌కు చేరుకున్నారు. మెడికల్ ఖర్చుల కోసం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని కూడా అందించినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. సతీష్ స్వదేశానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కష్ట సమయంలో అండగా నిలిచి సతీష్‌ను స్వదేశానికి తీసుకురావడంలో సహకరించిన కేటీఆర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని బాధిత కుటుంబానికి అండగా నిలిచారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.



# పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పూర్తి దిశగా అడుగులు: సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణాన్ని తామే చేపట్టామని చెప్పుకునే వారు, రేపు పోలవరం ప్రాజెక్టు పూర్తయినా తామే నిర్మించామని చెప్పే పరిస్థితి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఏడాదిలోనే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా అనకాపల్లి వరకు నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వెలిగొండ ప్రాజెక్టుకు గతంలోనే తాను పునాది వేశానని చంద్రబాబు పేర్కొన్నారు. కరువు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా వెలిగొండ ప్రాజెక్టును ఈ నెలలోనే పూర్తి చేసి మార్కాపురం ప్రాంతానికి నీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా పట్టాదారు పాస్‌బుక్‌లతో పాటు సాగునీటి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.




# రాహుల్ గాంధీ వైఖరిపై బీజేపీ విమర్శలు.. యువతపై అణచివేతకు ఎందుకు మౌనం?: ప్రశ్న

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని బీజేపీ విమర్శించింది. ఇతర రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యం, యువత హక్కులపై ప్రశ్నలు లేవనెత్తే రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పాలనలో ఉన్న ఝార్ఖండ్‌లో జనరేషన్-జెడ్ యువతపై జరుగుతున్న అణచివేతపై ఎందుకు స్పందించడం లేదని బీజేపీ నేతలు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం, యువత హక్కుల విషయంలో రాజకీయాలకు అతీతంగా ఒకే విధమైన వైఖరిని అవలంబించాలని సూచించారు. దేశంలోని యువత రాజకీయ పరిణామాలను గమనిస్తోందని, ప్రజాస్వామ్య విలువలపై జరిగే ప్రతి పరిణామాన్ని ప్రజలు పరిశీలిస్తున్నారని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

# భూ సంస్కరణల నుంచి తల్లీబిడ్డల భద్రత వరకు.. ఏపీ ప్రభుత్వ కీలక నిర్ణయాలు

అమరావతి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రజల రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, రైతులు, మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. గత పాలనలో అస్తవ్యస్తంగా మారిన భూమి రికార్డులను ప్రక్షాళన చేసి ప్రజలకు రెవెన్యూ సమస్యల నుంచి శాశ్వత విముక్తి కల్పించాలనే లక్ష్యంతో రెవెన్యూ రిఫార్మ్స్–2026ను తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మయన్మార్‌లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సంస్కరణలు, పెట్టుబడుల ఆకర్షణ, అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి నారా లోకేష్ చూపుతున్న నాయకత్వాన్ని ఫార్చ్యూన్ ఇండియా ప్రశంసించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఆయనను ‘ఆంధ్రా రైజింగ్ స్టార్’గా పేర్కొంటూ ప్రత్యేక కథనం ప్రచురించి పనితీరును వివరించినట్లు వెల్లడించింది. ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల సమస్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు తల్లీబిడ్డల భద్రత, ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సౌకర్యాలతో 102 ‘తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్’ వాహనాలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కొత్త వాహనాల రూపకల్పన, బ్రాండింగ్‌ను ఖరారు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. భూ రికార్డుల ప్రక్షాళన, విదేశాల్లో చిక్కుకున్న యువతను స్వదేశానికి తీసుకురావడం, పొగాకు రైతులకు సహాయం, తల్లీబిడ్డల రవాణా సేవల ఆధునికీకరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది.

# హుజూర్‌నగర్‌లో ఆగస్టు 13న యువ సమ్మేళనం

హుజూర్‌నగర్, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే యువశక్తిని ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో హుజూర్‌నగర్‌లో ఈ నెల 13న గురువారం 'యువ సమ్మేళనం-2026' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 15 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉదయం 9:30 గంటలకు మెయిన్ రోడ్డులోని పాత విజయలక్ష్మి థియేటర్ సమీపంలోని వర్తక సంఘం భవనంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువతలో ఐక్యత, చైతన్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు దేశ భవిష్యత్తుపై యువత పాత్రను చర్చించేందుకు ఈ సమ్మేళనం వేదికగా నిలవనుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



# కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా మెదక్‌లో జైలు భరో.. 100 మంది అరెస్ట్

మెదక్, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలో జైలు భరో కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ సంఘాల జాతీయ పిలుపులో భాగంగా ఎంఆర్‌ఓ కార్యాలయం నుంచి పోస్టాఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు సుమారు 100 మందిని పోలీసులు అరెస్ట్ చేసి అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.అడివయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడం వల్ల కార్మికుల హక్కులకు నష్టం జరుగుతుందని ఆరోపించారు. విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ, రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగింపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విత్తన చట్టాలు, వాణిజ్య ఒప్పందాలు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను ఆయన విమర్శించారు. దేశంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని కోరారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తామని అడివయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యూయూ జిల్లా కార్యదర్శి కె.మల్లేశం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జె.సంతోష్, సీఐటీయూ యంగ్ వర్కర్స్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గణేష్‌రెడ్డి, సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ, ఎన్‌పీఆర్‌డీ నాయకులు యశోద, కవిత, దుర్గ, దేవయ్య, యాదగిరి, వెంకన్న, దాసు, స్వరూప, షౌకత్, సిద్ధవ్వ, సాయిలు, ప్రమీల, కుమ్మరి దుర్గయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో 'జైలు భరో'.. సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల కార్యకర్తల అరెస్ట్





మధిర, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్): కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో మధిర పట్టణంలో నిర్వహించిన 'జైలు భరో కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముందుగా స్థానిక ఎండీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమావేశంలో హమాలీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ వర్కర్లు, ఇతర స్కీం వర్కర్లు, వ్యవసాయ కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేశారు. అనంతరం భగత్‌సింగ్ విగ్రహం సమీపంలోని వంతెన వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా విధానాలు అమలు చేస్తూ సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెంచుతోందని ఆరోపించారు. ప్రజాసంఘాల పిలుపులో భాగంగానే దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోలీసుల అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శీలం నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మందా సైదులు, డివిజన్ కార్యదర్శి పాపినేని రామనరసయ్య, సీఐటీయూ పట్టణ కన్వీనర్ పడకంటి మురళి, రైతు సంఘం మండల కార్యదర్శి మందడపు ఉపేంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు అంగడాల అమరయ్య, షేక్ ఉద్దండు సాహెబ్‌తో పాటు తేలపోలు రాధాకృష్ణ, ఓట్ల శంకర్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.





# కొల్చారంలో 300 మంది గర్భిణులకు ఉచితంగా పోషకాహార కిట్ల పంపిణీ

కొల్చారం, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొల్చారం మండలంలో 'మాతృదేవోభవ' కార్యక్రమం నిర్వహించి 300 మంది గర్భిణులకు ఉచితంగా ప్రొటీన్ కిట్లను పంపిణీ చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కొల్చారం మండల కేంద్రంలోని బాబా గార్డెన్స్, రంగపేటలోని శ్రీరంగనాయక ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ గర్భిణులకు అవసరమైన పోషకాహారం అందించడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యానికి తోడ్పడాలనే ఉద్దేశంతో 'మాతృదేవోభవ' కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి తల్లి ఆరోగ్యంగా ఉండటం, ప్రతి బిడ్డ ఆరోగ్యంగా జన్మించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులతో కలిసి భోజనం చేసిన ఆయన వారి ఆరోగ్య పరిస్థితులు, అవసరాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సవరించిన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా హుజూర్‌నగర్‌లో ఐఎన్‌టీయూసీ నిరసన

హుజూర్‌నగర్, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సవరించిన కార్మిక చట్టాలను, రైతు, విద్యార్థి, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ ఐక్య కార్మిక సంఘాల పిలుపు మేరకు హుజూర్‌నగర్ పట్టణంలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవరెడ్డి ఆదేశాల మేరకు ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు స్థానిక పోస్టాఫీసు వద్ద నిరసన చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించాలని, కార్మికులకు నష్టం కలిగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, మండల అధ్యక్షుడు మేళ్లచెరువు ముక్కంటి, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఇంటి అచ్చమ్మ, నాయకులు చింతకాయల రాము, ఫ్రూట్ మర్చంట్ యూనియన్ అధ్యక్షుడు మద్దం నాగేందర్, పార్బాయిల్డ్ రైస్ మిల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు సలిగంటి జానయ్య, చింతలపాలెం మండల అధ్యక్షుడు చింతిర్యాల రవీందర్, రాజీవ్ గాంధీ మట్టపల్లి అడ్డ ఆటో యూనియన్ అధ్యక్షుడు హబీబ్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శీలం వీరయ్య, సివిల్ సప్లై యూనియన్ నాయకులు చింతకాయల వెంకన్న, పంగ నర్సింహారావు, భూపతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# కోదాడలో కార్మిక, కర్షక సంఘాల జైలు భరో.. పలువురు సీపీఎం నాయకుల అరెస్ట్




కోదాడ, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ అఖిల భారత పిలుపులో భాగంగా కోదాడ పట్టణంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైలు భరో కార్యక్రమం నిర్వహించారు. సుందరయ్య భవన్ నుంచి కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ప్రదర్శనగా బయలుదేరి రంగా థియేటర్ సెంటర్, రాజీవ్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు, కర్షకులు తమ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు గతంలో పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కొత్త విధానాలను తీసుకొస్తోందని ఆయన ఆరోపించారు. దేశ సంపదను స్వదేశీ, విదేశీ గుత్త పెట్టుబడిదారులకు అప్పగించే విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని, కేంద్రం తీసుకొచ్చిన కొత్త ఉపాధి పథకంపై పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు, విత్తన చట్టాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఉపసంహరించుకుని వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించిన సీపీఎం నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి కోదాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోటగిరి వెంకటనారాయణ, రైతు సంఘం నాయకులు బుర్రి శ్రీరాములు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలు, షేక్ సైదా, మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జూలకంటి విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సోంపంగి రాధాకృష్ణ, సీఐటీయూ నాయకులు బచ్చలకూరి స్వరాజ్యం, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, రైతు సంఘం జిల్లా నాయకులు బెల్లంకొండ సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నాగటి రాములు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రకృతి వనంలోని చెట్ల విక్రయంపై వివాదం.. విచారణకు ఉపసర్పంచ్ డిమాండ్

మెదక్ నియోజకవర్గం, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పోసానిపేట్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఉన్న చెట్లు, మొక్కలను గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే విక్రయించారంటూ గ్రామ ఉపసర్పంచ్ జి. రాములు ఆరోపించారు. గ్రామ సర్పంచ్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని తనకు నచ్చిన ధరలకు చెట్లను విక్రయించారని ఆయన ఆరోపిస్తూ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. పల్లె ప్రకృతి వనంలోని చెట్లను తొలగించడం లేదా విక్రయించడం జరిగితే అందుకు అవసరమైన అనుమతులు, గ్రామపంచాయతీ తీర్మానం, విక్రయించిన చెట్ల సంఖ్య, నిర్ణయించిన ధర, విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం తదితర వివరాలను అధికారులు పరిశీలించాలని ఉపసర్పంచ్ కోరారు. ఈ వ్యవహారంపై పంచాయతీరాజ్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా చెట్ల విక్రయం జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ ఆరోపణలపై గ్రామ సర్పంచ్ వివరణను కూడా తీసుకుని ప్రచురించడం ద్వారా పూర్తి వివరాలతో వార్తను అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.




## ఈ నెల 13 నుంచి నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు

హైదరాబాద్, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఈ నెల 13వ తేదీ నుంచి చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. ముందుగా వాక్-ఇన్ విధానంలో చిన్నారులను వైద్యులు పరీక్షించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల అనంతరం గుండె శస్త్రచికిత్స అవసరమని నిర్ధారణ అయిన చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు వెల్లడించారు. గత ఐదేళ్లుగా నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఉన్న పాత వైద్య పరీక్షల నివేదికలతో సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిమ్స్ పాత బ్లాక్‌కు నేరుగా వచ్చి సంప్రదించవచ్చని సూచించారు. ఈ ఉచిత వైద్య సేవలను అవసరమైన చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని నిమ్స్ అధికారులు కోరారు.

## ఘనంగా నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ జన్మదిన వేడుకలు




సంగారెడ్డి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్): నిజాంపేట్ నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ శెనిగల ధన్‌రాజ్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆయన నివాసానికి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూలమాలలు, శాలువాలు, పూలగుచ్ఛాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానుల హర్షధ్వానాల మధ్య ధన్‌రాజ్ యాదవ్ కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ప్రేమాభిమానాలతో శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటూ నిజాంపేట్ నగరపాలక సంస్థ పరిధిలోని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ అభివృద్ధిలో ధన్‌రాజ్ యాదవ్ చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన సమయంలో పారిశుధ్యం, మౌలిక వసతులు, తాగునీరు తదితర ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతూ ప్రజలకు అందుబాటులో ఉండేవారని పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నిరుపేదలకు అన్నదానం, వస్త్రదానం చేయడంతో పాటు స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, రాజకీయ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, 191 కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధన్‌రాజ్ యాదవ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



## కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు వీడకపోతే మోదీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

వట్‌పల్లి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వట్‌పల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జైలు భరో కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు చౌరస్తాలో బైఠాయించి నిరసన వ్యక్తం చేయగా, అనంతరం పోలీసులు పలువురు నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ వట్‌పల్లి మండల కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, యువతకు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. రైతుల పోరాటాల నేపథ్యంలో గతంలో కేంద్ర ప్రభుత్వం రైతు చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. విద్యార్థులు, యువత సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్, విత్తన రంగాలను ప్రైవేటీకరించి కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను విరమించుకోవాలని, ఉపాధి కూలీలకు నష్టం కలిగించే చర్యలను నిలిపివేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని రూ.42 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజా సమస్యలను విస్మరిస్తోందని విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే కార్మికులు, రైతులు, కూలీలు, విద్యార్థులు, యువతను దేశద్రోహులుగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించారు. ప్రజలంతా ఐక్యంగా ఉద్యమిస్తే ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించే ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పవచ్చని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు పోరాటాలు కొనసాగిస్తామని మహేష్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు బాలమణి, స్వప్న, సరళమ్మ, కవిత, నరేందర్‌గౌడ్, సంజీవులు, గోపాల్, లక్ష్మణ్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



## పాత తలుపు పడి ఏడేళ్ల బాలిక మృతి.. వెల్దుర్తిలో విషాదం

వెల్దుర్తి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పాత తలుపు, డోర్ ఫ్రేమ్‌పై ఎక్కేందుకు ప్రయత్నించిన ఏడేళ్ల బాలికపై అవి పడటంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన విషాద ఘటన వెల్దుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెల్దుర్తి గ్రామపంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న ఆశాల యేసు కుమార్తె అలేఖ్య (7) సోమవారం ఉదయం ఇంటి బయట ఆడుకుంటోంది. ఈ క్రమంలో ఇంటి పక్కన ఉంచిన పాత తలుపు, డోర్ ఫ్రేమ్‌పై ఎక్కేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా అవి చిన్నారిపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే బాలికను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ ఘటనపై ఎలాంటి అనుమానాలు లేవని బాలిక తండ్రి యేసు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. వెల్దుర్తి ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె అనుకోని ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చిన్నారి మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## నియో ప్రగతి పాఠశాలలో ఘనంగా ఆషాఢమాస బోనాల ఉత్సవాలు




నారాయణఖేడ్, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని నియో ప్రగతి ఉన్నత పాఠశాలలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పారు. భావితరాలకు తెలంగాణ సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో పాఠశాలలో బోనాల వేడుకలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సతీమణి సుశీల విశ్వనాథ్, పాఠశాల కరస్పాండెంట్ కమ్మరి వెంకటరత్నం, ప్రిన్సిపల్ కమ్మరి ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారుల పరిశీలన



సంగారెడ్డి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్): సంగారెడ్డి పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్న అంబేద్కర్ స్టేడియం, తారా డిగ్రీ కళాశాల ప్రాంగణాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, సభా వేదిక నిర్మాణం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్అండ్‌బీ అధికారులు, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పోలీస్ శాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## బేగరి శ్రీశైలం జన్మదిన వేడుకలు ఘనంగా

వట్‌పల్లి, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్): అందోల్ నియోజకవర్గం వట్‌పల్లి మండలం మరవెల్లి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త బేగరి శ్రీశైలం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై శ్రీశైలంతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మఠం భిక్షపతి మాట్లాడుతూ శ్రీశైలం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మరవెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మన్నే జగదీశ్వర్, మల్లుగల ప్రశాంత్, బేగరి దావీదు, బేగరి దేవయ్య, తలారి కిషన్, తలారి అబ్రహం, బేగరి జానీ తదితరులు పాల్గొని శ్రీశైలంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




## పోసానిపల్లె రోడ్డుపై చెట్ల నరికివేతపై గ్రామస్తుల ఆందోళన

చౌటకూర్, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చౌటకూర్ నుంచి పోసానిపల్లె గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న చింత, వేప, కానుగ తదితర ఏళ్లనాటి చెట్లను కొందరు నరికివేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్న సమయంలో మరోవైపు రహదారి వెంట ఉన్న పాత వృక్షాలను తొలగించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు కీలకమైన పాత చెట్లను కాపాడాలని కోరారు. రహదారి పక్కన చెట్ల నరికివేతకు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికివేసినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



## కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి: సీఐటీయూ

జోగిపేట, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు, అందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా జోగిపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో జైలు భరో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్మికులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్మికులు, రైతులు ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. జైలు భరో కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.




## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియకు నేటితో ముగింపు

హైదరాబాద్, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగమైన ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియకు నేటితో ముగింపు పలకనున్నారు. అర్ధరాత్రి 12 గంటల వరకు ఎన్‌్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించినట్లు సమాచారం. ఇప్పటివరకు సుమారు 73 లక్షల ఎన్‌్యూమరేషన్ ఫారాలు తిరిగి రాలేదని అధికారులు వెల్లడించినట్లు తెలుస్తోంది. అలాగే సుమారు 45 లక్షల మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు మారినట్లు, 9 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు, మరో 6 లక్షల వరకు నకిలీ లేదా డూప్లికేట్ ఓట్లు గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ ఎన్నికల సంఘం అధికారులు రేపు సాయంత్రం అధికారికంగా వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.



## ఎమ్మార్పీఎస్ గ్రామ, మండల కమిటీల ఏర్పాటును వేగవంతం చేయాలి

సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం | ఆగస్టు 11: అందోల్ నియోజకవర్గ పరిధిలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల గ్రామ, మండల కమిటీలను త్వరితగతిన పూర్తి చేసి సంస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వి.ఎస్. రాజు మాదిగ పిలుపునిచ్చారు. అందోల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సుకు పూర్తిస్థాయి మండల కమిటీలతో పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. భవిష్యత్ కార్యాచరణలో మాదిగ విద్యార్థులు, యువత, మహిళలు విస్తృతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అందోల్ మండల ఇన్‌చార్జిగా తుడుం రాములు మాదిగ, చౌటకూర్ మండల ఇన్‌చార్జిగా ఎర్రోళ్ల రమేష్ మాదిగ, వట్పల్లి మండల ఇన్‌చార్జిగా బురగల ప్రభాకర్ మాదిగ, పుల్కల్ మండల ఇన్‌చార్జిగా నడిమిదొడ్డి సాయికృష్ణ మాదిగ, మునిపల్లి మండలం నుంచి జంగం నవీన్ మాదిగ, కోఆర్డినేటర్‌గా విజయ్ కుమార్ మాదిగ, రాయికోడ్ మండలం నుంచి శ్రీకాంత్ మాదిగలను నియమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, నియోజకవర్గ మాదిగ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్‌కు మల్లేష్ యాదవ్ బృందం శుభాకాంక్షలు




వికారాబాద్ జిల్లా సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 11: భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన యూ. రమేష్ కుమార్‌ను మర్పల్లి మండలానికి చెందిన జిల్లా నాయకుడు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలోని బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ రమేష్ కుమార్ నాయకత్వంలో వికారాబాద్ జిల్లాలో బీజేపీ మరింత బలోపేతం కావాలని, ఆయన ఆధ్వర్యంలో పార్టీ ప్రజల విశ్వాసాన్ని చూరగొని రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం రమేష్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు మధుకర్, కుడుగుంట ఉపసర్పంచ్ శేఖర్, సుభాష్, రాజు, శ్రీధర్ రెడ్డి, జైపాల్, రాజేష్, జగన్, సంగమేష్, మధు, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొని నూతన జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.



## పేకాట స్థావరంపై జోగిపేట పోలీసుల దాడి.. ఐదుగురు పట్టివేత

మెదక్ నియోజకవర్గం సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 11: జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాసంపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 10న సాయంత్రం 5.30 గంటల సమయంలో అందిన విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ గిరి శ్రీకాంత్ పోలీసు సిబ్బంది పీసీ సంగమేశ్వర్, పీసీ అరవింద్ రాథోడ్, హెచ్‌జీ సురేష్‌లతో కలిసి మాసంపల్లి గ్రామ శివారులో ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు. వీరిలో మాసంపల్లి గ్రామానికి చెందిన నలుగురు, పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఒకరు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,900 నగదు, పేకాట ముక్కలు, ఐదు వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.




## జోగిపేటలో సీఐటీయూ భారీ ర్యాలీ కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన

సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం | జోగిపేట, ఆగస్టు 11: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జోగిపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూయూ తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలతో పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను పరిరక్షించాలని, కార్మికులకు నష్టం కలిగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకునే నిర్ణయాలను వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ర్యాలీలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## జోగిపేటలో యువ సమ్మేళనం.. దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కీలకం

సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం | జోగిపేట, ఆగస్టు 11: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జోగిపేట ఖండ పరిధిలో యువ సమ్మేళనం కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ సైనికుడు వంజరి రవీందర్ ముఖ్య అతిథిగా, ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ్ సహ కార్యవహ బొల్లి నర్సింలు వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు కీలక శక్తిగా నిలవాలని, దుర్వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో జీవించాలని సూచించారు. వ్యక్తిగత ప్రగతితో పాటు సమాజం, దేశ అభివృద్ధిలో యువత బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ సేవకు అంకితం కావాలని కోరారు. కార్యక్రమంలో జోగిపేట ఖండ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు, స్వయంసేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల ఫిర్యాదులను స్వీకరించిన సూర్యాపేట ఎస్పీ

సందేశం టైమ్స్, సూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి | ఆగస్టు 11: సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ బాధితుల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీని ప్రత్యక్షంగా కలిసి వివరించారు. ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను ఓపికగా విన్న ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖను సంప్రదించవచ్చని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

## రాజ్యాంగ హక్కులు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన కల్పించిన సదస్సు



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్ | ఆగస్టు 11: పటాన్‌చెరు శాంతినగర్‌లోని మెథడిస్ట్ చర్చిలో పటాన్‌చెరు నియోజకవర్గ క్రిస్టియన్ లీగల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, అవగాహన సదస్సులో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాజ్యాంగ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆధ్యాత్మిక విలువలతో పాటు రాజ్యాంగ స్ఫూర్తి, చట్టపరమైన పరిజ్ఞానం, సామాజిక బాధ్యతపై ప్రజల్లో చైతన్యం పెంచే కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించాలని ఆయన సూచించారు.



## సంగారెడ్డిలో ఘనంగా మన్నె సంఘం బోనాల ఉత్సవాలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్ | ఆగస్టు 11: సంగారెడ్డి పట్టణంలో మన్నె సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఐబీ నుంచి అస్తబల్ వరకు బోనాల ఊరేగింపు నిర్వహించగా మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్లు, నృత్యాలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా చింత సాయినాథ్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్తపల్లి శ్రీకాంత్ నాని, నారాయణ, వెంకటేశం, మన్నె సంఘం నాయకులు, మహిళలు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ వివాహం రోజే యువతిని తల్లిదండ్రులకు అప్పగించేందుకు డబ్బులు డిమాండ్ చేశాడన్న ఆరోపణ



ఏలూరు, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ జిల్లా ప్రతినిధి): నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన రాజేశ్వరి, కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన మధు ప్రేమించుకున్నట్లు సమాచారం. వీరిరువురు స్నేహితుల సమక్షంలో వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ప్రేమ వివాహం చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే వివాహం జరిగిన రోజే మధు రాజేశ్వరి తల్లికి ఫోన్ చేసి ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. తమపై ఎలాంటి కేసులు పెట్టకూడదనే షరతును కూడా పెట్టినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ షరతులకు అంగీకరిస్తే రాజేశ్వరిని వారి ఇంటి వద్దకు తీసుకువచ్చి అప్పగిస్తామని చెప్పినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాజేశ్వరి కుటుంబ సభ్యులు రూ.6 లక్షలు చెల్లించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆరోపణలపై సంబంధిత పోలీసుల విచారణతో మరిన్ని విషయాలు వెలుగులోకి రావాల్సి ఉంది.



## టీటీడీ నూతన జేఈవోగా ప్రభల గోపీనాథ్ బాధ్యతల స్వీకరణ

తిరుమల, ఆగస్టు 12 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తిరుమల తిరుపతి దేవస్థానాల నూతన జేఈవో (వైద్యం, విద్య)గా నియమితులైన ప్రభల గోపీనాథ్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, బోర్డు సెల్ డిప్యూటీ ఈవో ప్రశాంతి, ఇతర టీటీడీ అధికారులు పాల్గొన్నారు. నూతన జేఈవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రభల గోపీనాథ్‌కు టీటీడీ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## గడ్చిరోలిలో విషాదం.. పాముకాటుకు ముగ్గురు విద్యార్థినులు మృతి

మహారాష్ట్ర, ఆగస్టు 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో నేలపై నిద్రిస్తున్న ఆరుగురు విద్యార్థినులను పాము కాటేసినట్లు సమాచారం. ఈ ఘటనలో అను (12), దీపిక (14), సుష్మిత (12) అనే ముగ్గురు విద్యార్థినులు మృతి చెందినట్లు తెలుస్తోంది. మరో విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హెలికాప్టర్ ద్వారా నాగ్‌పూర్‌కు తరలించినట్లు సమాచారం. ఘటనతో ఆశ్రమ పాఠశాలలో, విద్యార్థినుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. అధికారులు ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారు.









## చిట్కుల్ క్యాంప్ కార్యాలయంలో స్థానికులతో భేటీ

సందేశం టైమ్స్, పటాన్‌చెరు ప్రతినిధి | ఆగస్టు 11: చిట్కుల్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులతో భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆషాఢమాస బోనాల పండుగను పురస్కరించుకుని నిర్వహించనున్న ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమాలకు పలువురు ఆహ్వానాలు అందించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్ మన్నె రాఘవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫలారం బండి ఊరేగింపుతో పాటు పటాన్‌చెరు పట్టణంలో యాదవ సంఘం, గూగుల్ యూత్, గోనెమ్మబస్తీ జూనియర్ బాయ్స్ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమాలకు కూడా ఆహ్వానించారు. ఇదే సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ మల్లేశ్వరి కుమారుడు, ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యుడు మణికంఠ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బోనాల పండుగ కార్యక్రమాలు విజయవంతంగా, భక్తిశ్రద్ధలతో జరగాలని ఆకాంక్షించారు.

## శ్రీశైలం నుంచి సాగర్‌కు 26,209 క్యూసెక్కుల నీటి విడుదల

సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 11: శ్రీశైలం జలాశయంలో కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. విద్యుదుత్పత్తి అనంతరం 26,209 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 8 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి 3,050 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## పాలకొల్లులో నేడు ఆక్వా రైతుల భారీ బహిరంగ సభ

సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 11: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నేడు ఆక్వా రైతుల ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆక్వా రంగానికి విద్యుత్ సబ్సిడీ అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆక్వా రైతులు కృతజ్ఞతలు తెలియజేయనున్నారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులకు సంబంధించిన విద్యుత్ సబ్సిడీ ప్రభుత్వ ఉత్తర్వులను మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు వేదికపై విడుదల చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సభకు పెద్ద సంఖ్యలో ఆక్వా రైతులు, మత్స్యకారులు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారు.



## ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి: ఆగస్టు 15న సీఎం ప్రకటన చేయాలి

సందేశం టైమ్స్ హనుమకొండ ప్రతినిధి | ఆగస్టు 11: తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సహాయ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాళోజి సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు డప్పుచప్పుళ్లతో సాగిన ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా టీఆర్ఎస్ నాయకులు డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం, ఉద్యమకారుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బాషాబోయిన రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్లు, అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థి ఉద్యమకారులకు ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు, ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం కల్పించాలని కోరారు. మృతి చెందిన ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు ఉద్యమకారులు అనుకోకుండా మరణించిన సందర్భంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేకే కమిటీ ద్వారా ఉద్యమకారుల నుంచి అభిప్రాయాలు, సూచనలు సేకరించినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. ఆగస్టు 15న ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులతో కలిసి ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన, ఉద్యమకారుల కమిటీ నాయకులు, మహిళా నాయకులు, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ప్రజా సమస్యల పరిష్కారం కోసం జైల్ భరో.. నాగల్‌గిద్దలో కార్మికుల అరెస్ట్

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | ఆగస్టు 11: ప్రజా, కార్మిక, రైతు సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జైల్ భరో కార్యక్రమంలో భాగంగా నాగల్‌గిద్ద మండలంలో కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొతారి నర్సింలు, సీఐటీయూ మండల నాయకులు గణపతి మాట్లాడుతూ కార్మికులు, రైతుల హక్కులను కాలరాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకురావడం కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. పెరుగుతున్న గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యతో యువత ఇబ్బందులు పడుతున్నారని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను విరమించుకోవాలని కోరారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన చేపడుతున్న తమను పోలీసులు అరెస్ట్ చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు నిర్మల, సంగీత, సవిత, సురేఖ, జ్యోతి, అల్‌వేణి, విద్యావతి, రుక్మిణి, తూకారం, సాయి, దాస్, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.



## పేకాట స్థావరంపై జోగిపేట పోలీసుల దాడి.. ఐదుగురు అరెస్ట్

సందేశం టైమ్స్, అందోల్ మండల రిపోర్టర్ వి. వెంకటేశం | ఆగస్టు 11: జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాన్సాన్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సాయంత్రం అందిన విశ్వసనీయ సమాచారంతో ఎస్సై గిరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆకస్మికంగా దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,900 నగదు, ఐదు వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



## 16వ వార్డులో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

సందేశం టైమ్స్, అందోల్ మండల రిపోర్టర్ వి. వెంకటేశం | ఆగస్టు 11: అందోల్–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో దోమల నివారణ, విషజ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వార్డులోని పలు ప్రాంతాల్లో దోమల మందును పిచికారీ చేయించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తితో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కౌన్సిలర్ తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు దోమల బారిన పడకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం జైల్ భరో.. నాగల్‌గిద్దలో కార్మికుల అరెస్ట్



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | ఆగస్టు 11: ప్రజా, కార్మిక, రైతు సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జైల్ భరో కార్యక్రమంలో భాగంగా నాగల్‌గిద్ద మండలంలో కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొతారి నర్సింలు, సీఐటీయూ మండల నాయకులు గణపతి మాట్లాడుతూ కార్మికులు, రైతుల హక్కులను కాలరాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకురావడం కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. పెరుగుతున్న గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యతో యువత ఇబ్బందులు పడుతున్నారని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను విరమించుకోవాలని కోరారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన చేపడుతున్న తమను పోలీసులు అరెస్ట్ చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు నిర్మల, సంగీత, సవిత, సురేఖ, జ్యోతి, అల్‌వేణి, విద్యావతి, రుక్మిణి, తూకారం, సాయి, దాస్, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశంలో కనిపించని సూర్యగ్రహణం.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 11: ఆగస్టు 12న సంభవించనున్న సూర్యగ్రహణం భారతదేశంలో కనిపించదని సమాచారం. భారత కాలమానం ప్రకారం గ్రహణం సాయంత్రం సుమారు 7 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు కొనసాగనున్నప్పటికీ, ఆ సమయానికి భారత్‌లో సూర్యాస్తమయం పూర్తవుతుందని పేర్కొంటున్నారు. దీంతో దేశంలో ఈ సూర్యగ్రహణాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉండదని, గ్రహణం కనిపించని ప్రాంతాల్లో ప్రత్యేకంగా గ్రహణకాల ఆచారాలు పాటించాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. గ్రహణం పేరుతో ప్రజల్లో భయాందోళనలు కలిగించే సమాచారాన్ని నమ్మకుండా శాస్త్రీయ సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.